ప్రశ్నించడమే రాజద్రోహం అనే ధోరణి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించడమే రాజ ద్రోహమనే ధోరణి నడుస్తున్నదని, ప్రజలు అంతా గమనిస్తున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. ప్రశ్నించినందుకు ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారని, ఇది బాధాకరమన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, మల్లారెడ్డి, కెపి.వివేకనందగౌడ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. గతంలో రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్ట్ విజయారెడ్డి, సరితపై దాడి చేశారని, రాష్ట్రంలో అసలు ఏం పాలన సాగుతుందో తెలియడం లేదని అన్నారు. రేవంత్‌రెడ్డి వద్దే హోంశాఖ ఉందని, ఆయన కనుసైగల్లో జర్నలిస్టులపై దాడి జరుగుతోందని, ముఖ్యమంత్రి ఇంకా స్పందించడం లేదని విమర్శించారు. వేదికలపై మాత్రం మహిళల గురించి గొప్పలు చెబుతున్నారని, రాష్ట్రంలో మహిళా జర్నలిస్టుల అరెస్టును కపిల్ సిబల్ ఖండించారని చెప్పారు. ఇందిరమ్మ పాలన, సోనియమ్మ దీవెన అంటూ మహిళా జర్నలిస్టుల అరెస్టు, మీడియా ప్రతినిధుల మీద జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారన్నారు. ఏదో రకంగా సభలో తమను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, మాట్లాడే అవకాశమూ ఇవ్వడం లేదన్నారు.

క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ అల్వాల్ మండలం తిరుమలగిరి విలేజ్ లోతుకుంటలో ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు. కంటోన్మెంట్‌లోని జనరల్ భూమి రికార్డ్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానిదిగా నమోదు కాగా, ప్రయివేటు వ్యక్తులు తమదని చెప్పడంతో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వందకు పైగా ఎకరాలున్న ఈ భూమిలో ఎలాంటి కట్టడాలకూ అనుమతులివ్వరాదని అధికారులకు కమిషనర్ సూచించారు. గండిమైసమ్మ మండలం దుండిగల్ విలేజ్‌లోని బుబ్బఖాన్ చెరువు దిగువున వున్న లింగం చెరువు కాలువ పరిసరాలను పరిశీలించారు. బుబ్బఖాన్ చెరువు అలుగు, తూముల నుంచి వరద నీరు వెళ్లకుండా నాలను కబ్జాచేసి నిర్మాణాలు జరిగాయని, దీంతో వరద ముంచెత్తుతోంది స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నాలా సమస్యను పరిష్కరించాలని కోర్టు ఆదేశాల నేపథ్యంలో మీరంతా కలిసికట్టుగా నిర్ణయానికి రావాలని, స్థానికులకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు కమిషనర్ సూచించారు. అనంతరం హఫీజ్‌పేట దగ్గర ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు. టీడీఆర్ కింద లబ్ధిపొంది ప్రభుత్వ భూమిని కబ్జా చేశారా అనే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమయంలో పలుచోట్ల పలువురు స్థానిక సమస్యలే కాకుండా వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మరికొందరు కబ్జాల బారి నుంచి తమ భూములు, ఇండ్లును కాపాడుతున్న వైనానికి కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు.



సంస్కృతాంధ్ర భాషా పండితులు వేటూరి ప్రభాకర శాస్త్రి

ప్రజాశక్తి - కల్చరల్

సంస్కృత ఆంధ్ర భాషల్లో సమ పాండిత్య ప్రతిభ కల వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు జాతి కి శాశ్వత సాహిత్య సంపద అందించారని తెలంగాణ పౌర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో ఎందరో మహానుభావులు మధుర స్మృతులు లో భాగంగా భాషా శాస్త్ర పండితులు వేటూరి ప్రభాకర శాస్త్రి సంస్మరణ సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులను చరిత్రలో మరుగు పడకుండా వారి గురించి న జయంతి, సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. విశ్వవిద్యాలయాలు లేదా సాహిత్య అకాడెమీలు చేయవలసిన పని గాన సభ జరుపుతూ నేటి తరాలకు అందించడం ముదావహం అన్నారు. అన్నమయ్య కీర్తనల తాళ పత్రాల నుంచి పరిస్కృతం చేసిన ప్రభాకర శాస్త్రి చిన్న వయస్సులోనే అవధాన విద్యలో ప్రావీణ్యత పొందారని వివరించారు. తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్కను వెలుగులోకి తెచ్చిన ప్రభాకర శాస్త్రి , బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవను సమాజానికి తెలిపారని అన్నారు. అయన కవి పరిశోధకుడు వ్యాస కర్త తదితర సహితీ ప్రక్రియలో ప్రజ్ఞా శాలి అని అన్నారు. ప్రముఖ గాయని గాయని శ్రీదేవి, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సంఘసేవకులు పిఎస్ ఎన్.మూర్తి, సంఘసేవకురాలు దేవసేన తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఒంటిపూట బడులు

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఒంటిపూట బడులు వచ్చేనెల 23 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు యధావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని వివరించారు.

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొడతాం

- ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకుంటున్న బిజెపి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నియోజకవర్గాల పునర్విభజనపై చర్చకు రావాలని తమిళనాడు సిఎం స్టాలిన్ ఆహ్వానం



సిఎం రేవంత్‌కు ఆహ్వానం అందజేస్తున్న డిఎంకె ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టే కార్యాచరణ చేపడతామని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అది నియోజకవర్గాల పునర్విభజన కాదని దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే ప్రయత్నమని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు.. చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు చెన్నైలో ఈ నెల 22న జరిగే సమావేశానికి హాజరుకావాలంటూ రాష్ట్ర సిఎం రేవంత్‌ను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆహ్వానించారు. ఈ మేరకు తమిళనాడు సిఎం రాసిన లేఖను ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కెఎన్ నెహ్రూ ఆధ్వర్యంలోని డిఎంకె ప్రతినిధి బృందం ఢిల్లీలో రేవంత్ రెడ్డికి గురువారం అందజేసింది. 2026 తర్వాత చేపట్టే జన గణన వరకు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం అంతకుముందుగానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని తమిళనాడు సిఎం స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై తమ రాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్య కార్యాచరణ కమిటీలో (జెఎసి) చేరేందుకు అంగీకారం తెలపాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు జెఎసిలోకి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక ప్రతినిధిని నియమించాలని స్టాలిన్ లేఖలో సూచించారు. రేవంత్‌ను కలిసిన డిఎంకె ప్రతినిధి బృందంలో ప్రత్యేక ప్రతినిధి ఎకెఎస్ విజయన్, డిఎంకె పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి, డిఎంకె ఎంపిలు ఎ రాజా, ఎన్‌ఆర్ ఇళంగో, కళానిధి వీరస్వామి, అరుణ్ నెహ్రూ ఉన్నారు. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాన్ని ఏరకంగానూ తాము సహించబోమని హెచ్చరించారు. మేం (దక్షిణాది రాష్ట్రాలు) దేశానికి ఎంతో సేవ చేశామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి బిజెపికి పెద్దగా ప్రాతినిధ్యం లేదని... దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమితో ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలని బిజెపి భావిస్తోందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా ఇప్పటికే నిర్ణయించిందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని తాను చెన్నై సమావేశానికి హాజరవుతానని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ రాష్ట్రంలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని పార్టీల నేతలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానా రెడ్డిలకు సూచించినట్లు సిఎం తెలిపారు. తాము నిర్వహించే సమావేశానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామని... ఆయన సమావేశంలో పాల్గొని అక్కడ వెల్లడైన అభిప్రాయాలను కేంద్ర క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు అంతా పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. 22న చెన్నైలో నిర్వహించే సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజనతో కలిగే నష్టాలు.. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు. అన్ని పార్టీలు, పౌర సంఘాల అభిప్రాయాలు సేకరించేందుకు తమిళనాడు సిఎం స్టాలిన్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై స్టాలిన్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయనను ప్రోత్సహిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

హెచ్‌సియు భూముల విక్రయాన్ని నిలిపేయాలి

- ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూముల విక్రయాన్ని నిలిపేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. వర్సిటీ భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. హెచ్‌సీయూ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నెంబర్ 25 కింద 2,300 ఎకరాల స్థలాన్ని పరిశోధన, విద్యారంగ అభివృద్ధికి కేటాయించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ భూమిని వేలం వేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని తెలిపారు. గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న 400 ఎకరాలను స్పోర్ట్స్ అకాడమి నిర్మాణానికి మార్కెట్ విలువ కంటే చాలా తక్కువకు కేటాయించిందని పేర్కొన్నారు. అయితే తగిన అభివృద్ధి చేయడంలో ఆ కంపెనీ విఫలమవ్వడంతో ఆ భూములను ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల ద్వారా తిరిగి పొందిందని వివరించారు. ప్రస్తుతం ఈ భూమిని రూ.18 వేల కోట్ల (అంచనా విలువ)కు 2025 మార్చి ఎనిమిది నుంచి 15 తేదీల మధ్యన వేలం వేస్తున్నట్టు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. వర్సిటీలోని పర్యావరణ, అకడమిక్, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగిన ఇటువంటి స్థలాన్ని ప్రయివేట్, కార్పొరేట్ శక్తులు స్వార్థ ప్రయోజనాలకు ధారాదత్తం చేయడమే అవుతుందని విమర్శించారు.

విద్య, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రస్ఫుటం చేస్తున్నదని తెలిపారు. ఒక వైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయివేటీకరణను, సంపదను మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం విమర్శిస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్సిటీ భూములను ఎవరి ప్రయోజనాల కోసం వేలాన్ని నిర్వహిస్తున్నదని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, ఈ భూములను వర్సిటీకి కేటాయించి విద్య, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

కులగణన చారిత్రాత్మకం

- ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ చరిత్రలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన చారిత్రాత్మకమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. గురువారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లలో అన్ని విధాలుగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని 15 నెలల్లో ప్రజాపాలన దిశగా అడుగులు వేయించినట్టు తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నిమ్స్ వరకు నిధులివ్వక నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నమూనాగా ఏవో కొన్ని చేశారే తప్ప రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారి కోసం కార్యక్రమాలు తీసుకుంటున్నదని తెలిపారు. తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ ఒరవడి తెలంగాణలోనూ రావాలని ఆకాంక్షించారు.

టాప్ 100లో బిసిలు 48 మంది

- కొందరు వ్యక్తులు, సంస్థలు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారు
- టిజిపిఎస్‌సి కార్యదర్శి నవీన్ నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష సమాధాన పత్రాల మూల్యాంకనం ప్రక్రియ న్యాయమైన, పారదర్శకంగా జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 తాత్కాలిక మార్కులకు సంబంధించి అన్ని వివరాల్లోకి వెళ్లకుండా కొంతమంది వ్యక్తులు, సంస్థలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని తెలిపారు. కొందరు స్వార్థపరులు వారి ప్రయోజనాలకు అనుగుణంగా సమాచారాన్ని విశ్లేషించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని వివరించారు. ఇది గ్రూప్-1 అభ్యర్థుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలను నివృత్తి చేయడానికి, అభ్యర్థులు, సాధారణ ప్రజలకు తెలియజేయడానికి మరింత స్పష్టత, విశ్వాసం కోసం సమాచారాన్ని అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. హెచ్ఎండీఏ పరిధిలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించామని తెలిపారు. సమాధాన పత్రాల మూల్యాంకనం నవంబర్ ఒకటి నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు జరిగిందని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఈనెల పదో తేదీ కంటే ముందు తాత్కాలిక మార్కులను ప్రకటించలేదని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేయడమే టీజీపీఎస్సీ లక్ష్యమని పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా మార్కులను అభ్యర్థుల లాగిన్‌లో ఉంచామని తెలిపారు. సొంత అంచనాలతో అభ్యర్థులు సోషల్ మీడియాలో ఊహాగానాలతో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో అభ్యర్థుల్లో గందరగోళం, అనవసరమైన అశాంతిని తొలగించడానికి కమిషన్ గణాంకాలను విడుదల చేసిందని వివరించారు. 20,161 మంది అభ్యర్థులకు సంబంధించి అత్యధిక మార్కులు ఇంగ్లీష్‌లో 139.5, పేపర్-1లో 97.5 మార్కులు, పేపర్-2లో 102.5 మార్కులు, పేపర్-3లో 102.5 మార్కులు, పేపర్-4లో 113.5 మార్కులు, పేపర్-5లో 96.5 మార్కులు, పేపర్-6లో వంద మార్కులు వచ్చాయని తెలిపారు. ఇంగ్లీష్ మాధ్యమంలో 12,323 మంది, తెలుగు మాధ్యమంలో 7,829 మంది, ఉర్దూలో తొమ్మిది మంది రాశారని పేర్కొన్నారు. టాప్ వంద ర్యాంకుల్లో పురుషులు 59 మంది, మహిళలు 41 మంది ఉన్నారని వివరించారు. టాప్ వంద ర్యాంకుల్లో ఓసీలు 32 మంది, బీసీలు 48 మంది, ఎస్సీలు ముగ్గురు, ఎస్టీలు ఐదుగురు, ఓసీ ఈడబ్ల్యూఎస్ వారు 12 మంది ఉన్నారని పేర్కొన్నారు. 500 ర్యాంకు వరకు పురుషులు 296 మంది, మహిళలు 204 మంది ఉన్నారని తెలిపారు.

ఇందులో ఓసీలు 132 మంది, బీసీలు 228 మంది, ఎస్సీలు 50 మంది, ఎస్టీలు 38 మంది, ఓసీ ఈడబ్ల్యూఎస్ వారు 52 మంది చొప్పున ఉన్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం నోటిఫై చేసిన ఖాళీల ఆధారంగా అభ్యర్థులను మెరిట్ జాబితా నుంచి ఎంపిక చేస్తామని తెలిపారు. ఆర్డీవో, డీఎస్పీ, సీటీవో మొదలైన కేటగిరీ పోస్టుల్లో నోటిఫికేషన్ ప్రకారం రిజర్వు చేయని, రిజర్వు చేసిన కేటగిరీ అభ్యర్థులు నియామకమవుతారని వివరించారు.

రాష్ట్ర ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి హోలీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకునే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ హోలీ పండుగ అందరి కుటుంబాల్లో ఆనందోత్సవాలు నింపాలని ఆకాంక్షించారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

శంషాబాద్ క్లస్టర్‌లో గిడ్డంగులకు భలే గిరాకీ

- నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్

గడిచిన ఏడాదిలో హైదరాబాద్‌లో గిడ్డంగుల డిమాండ్ 35 లక్షల చదరపు అడుగులుగా నమోదయ్యిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ చేసింది. మొత్తం లావాదేవీల్లో తయారీ రంగం అత్యధికంగా 34 శాతం వాటాను.. రిటైల్ రంగం 33 శాతం వాటాను కలిగి ఉన్నాయి. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి శంషాబాద్ క్లస్టర్‌లో గిడ్డంగులకు ఎక్కువ డిమాండ్ చోటు చేసుకుంది. గతేడాది మొత్తం లావాదేవీల్లో శంషాబాద్ క్లస్టర్ ఏకంగా 47 శాతం వాటాను కలిగి ఉండటం విశేషం. ఈ క్లస్టర్‌లో శంషాబాద్, ఎరోట్రోపోలిస్, శ్రీశైలం హైవేస్, బొంగ్లూర్, కొత్తూర్, షాద్‌నగర్ ప్రాంతాలు ఈ క్లస్టర్‌లో వస్తాయి. 2024లో హైదరాబాద్ గిడ్డంగుల మార్కెట్‌లో సగటున చదరపు అడుగుకు రూ.20.7 అద్దె చెల్లింపులు జరిగాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే అద్దెలో 1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మెడ్చల్ క్లస్టర్ 46 శాతం, పటాన్‌చెరు క్లస్టర్ 7 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నాయి.

హైదరాబాద్‌లో టెయిల్ గ్లోబల్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

లైఫ్‌సైన్స్ కంపెనీలకు టెక్నాలజీ అడ్వైజరీ సేవలందించే స్విట్జర్లాండ్‌కు చెందిన టెన్త్‌పిన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ కంపెనీ హైదరాబాద్‌లో తన టెన్త్‌పిన్ ఎఐ ల్యాబ్స్ (టెయిల్) గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. దీనిని తెలంగాణ ప్రభుత్వ వాణిజ్య, ఐటి శాఖ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ లాంచనంగా ప్రారంభించారు. విస్తరణ ప్రక్రియలో భాగంగా టెన్త్‌పిన్ తెలంగాణను ఎంచుకోవడం సంతోషకరమని జయేష్ రంజన్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి ప్రపంచంలోనే అతి పెద్ద కేంద్రం కావడం ఆనందదాయకమన్నారు. లైఫ్‌సైన్స్ కంపెనీలు తమ నిపుణులతో కలిసి పని చేసేందుకు ఇది ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌గా వ్యవహరిస్తుందని కంపెనీ డైరెక్టర్ బార్ట్ రీజ్ పేర్కొన్నారు.

సభ రికార్డులు పరిశీలించండి..

- ఎమ్మెల్యే లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఏం మాట్లాడారో కాంగ్రెస్ నాయకులు సభ రికార్డులు పరిశీలించొచ్చని ఎమ్మెల్యే కోవా లక్ష్మి తెలిపారు. సభలో కాంగ్రెస్ నాయకుల తీరు సరిగ్గా లేదన్నారు. సభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని అడగడం సమంజసం కాదని, జగదీశ్‌రెడ్డి వ్యక్తిగతంగా స్పీకర్‌ను ఎక్కడా దూషించలేదని, కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమై దళిత స్పీకర్‌ను అవమానపరిచారనే మాట ముందుకు వేసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వంలో పత్రిక స్వేచ్ఛ లేకుండా పోయిందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తమ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతల ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఎండిన పంటలకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్‌డి అబ్బాస్
- కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగునీరు అందక జిల్లాలో ఎండిన పంటలకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ డిమాండ్ చేశారు. గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎండిన వరి పనలను ప్రదర్శిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు నీటిపై ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్ల రాష్ట్రంలో, జిల్లాలో వరి, ఇతర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పంటలు ఎండుతున్నా స్థానిక అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు స్పందించి రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. జిల్లాలో 40శాతం పంటలు ఎండిపోయాయని, రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నాట్లు వేయగా పంటలు ఎండిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారని తెలిపారు. రైతులు పంటలను రక్షించుకోవడానికి బోర్లు వేసి లక్షల



రూపాయలు అప్పుల పాలు అయ్యారని అన్నారు. మార్చి 16న సీఎం స్టేషన్ ఘన్‌పూర్‌కు వస్తున్న సందర్భంగా ఎండిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎం.కనకారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయకపోవడంతో రైతులకు, ప్రజలకు నీరందే పరిస్థితి లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును పట్టించుకోలేదని, రైతులను ఉద్ధరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా మాటలు చెప్పడం తప్ప పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దేవాదుల ప్రాజెక్టుకు పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయించి మొత్తం పనులు పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తొమ్మిది రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపి జిల్లాలో భూగర్భజలాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే రైతాంగం పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఈ. అహల్య, సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, బొట్లశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజయేందర్, పుత్కనూరి ఉపేందర్, బోడ నరేందర్, చిట్యాల సోమన్న, మండల కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా నేడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరసన

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా శుక్రవారం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని బిఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ 'ప్రపంచంలోనే అతి పెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని కెసిఆర్ ఏర్పాటు చేశారు. ఆ విగ్రహం వద్దకు వెళ్లి కూర్చునేందుకు అవకాశం లేకుండా గేట్లు మూసేశారు. ఆ మహానుభావుడిని సంకెళ్లతో బంధించిన నీచమైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా.. పేరుకేమో ప్రజాపాలన.. చేసేవన్నీ అప్రజాస్వామిక పనులు అన్నట్టుగా ఉంది' అని విమర్శించారు.



'జగదీశ్‌రెడ్డి గొంతు నొక్కడం కాదు.. ఆయన ఒక్కడికి జరిగిన అవమానం కాదు. ఈ రాష్ట్రంలోని రైతాంగం తరపున, రాష్ట్రంలోని ఆడబిడ్డల తరపున నెలకు రూ.2500 కావాలని గొంతు విప్పినందుకు, రైతాంగం తరపున రుణమాఫీ జరుగలేదని, ఎండుతున్న పంటల విషయంలో నిలదీసినందుకు, ప్రజల తరపున పెన్షన్ల గురించి, అమలు కానీ ఆరు గ్యారంటీలు, 420 హామీల గురించి ప్రశ్నించినందుకు తట్టుకోలేక ప్రభుత్వం ఓ కుయుక్తితో సస్పెండ్ చేశారు. కేవలం 20శాతం కమిషన్లు, ఢిల్లీకి మూటలుపంపడంపై ఉన్న దృష్టి ఈ రాష్ట్రంలో పేదలకు మేలు చేయాలనే విషయంలో కాంగ్రెస్ పాలకులకు లేదు. ఈ విషయం ప్రజలకు అర్థమైంది. అందుకే ప్రజలు సీఎంను ఎక్కడికక్కడ శాపనార్థాలు పెడుతున్నారు...అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ సభ్యులు ఉంటే కాంగ్రెస్ కమీషన్లు, కాంట్రాక్టులు, 420 హామీలు, ఢిల్లీకి మూటలు అన్నీ వెలుగులోకి వస్తాయనే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. భవిష్యత్తులో వారికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, శాసనమండలి నేత మధుసూదనాచారి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

స్పీకర్‌పై జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు


- క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ సభ్యుల నిరసన
- కాంగ్రెస్, బిఆర్ఎస్ సభ్యుల పరస్పర నినాదాలతో అట్టుడికిన శాసనసభ
- బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ జగదీశ్ రెడ్డి సస్పెన్షన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఈ సభ నీ సొంతం కాదు. మా అందరి తరపున అక్కడ కూర్చున్న పెద్దమనిషివి మాత్రమే' అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై సూర్యాపేట నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సభను అట్టుడికించాయి. కాంగ్రెస్ సభ్యులంతా లేచి జగదీశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. బిఆర్ఎస్ సభ్యులు కూడా లేచి అరవడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బిఆర్ఎస్ సభ్యుల పరస్పర అరుపులతో సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ 11:35 నిమిషాలకు ప్రకటించారు. తర్వాత తిరిగి మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో తిరిగి సభ ప్రారంభమైంది. ఆ తర్వాత జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సెషన్ వరకు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

ఏం జరిగిందంటే..

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనపై సభలో బిఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి లేస్తూనే తన మాటలతో ఎదురుదాడికి దిగారు. చాట్ జిపిటి, ఎఐ టెక్నాలజీ ఆధారంగా గవర్నర్ ప్రసంగం తయారు చేసినట్టుందని దెప్పిపొడిచారు. తెలుగులో ట్రాన్స్‌లేషన్ మక్కీకి మక్కీలా ఉందని, కొన్ని వ్యాక్యాలు అర్థం కాకుండా, ప్రారంభానికి, ముగింపునకు పొంతన కుదరకుండా, వాస్తవాలు లేకుండా ఉండడం ఆశ్చర్యకరంగా అనిపించిందన్నారు. గవర్నర్ ప్రసంగం మొక్కుబడిగా తయారు చేసినట్టు ఉందని, మనస్సు కవి ఆత్రేయ ఉంటే కాపీని చూసి ఆత్మహత్య చేసుకునేటోడని దెప్పిపొడిచారు. గవర్నర్‌తో 15 నెలల పాలనపై 36 నిమిషాల్లో 360 అవాస్తవాలు మాట్లాడించారని విమర్శించారు. ఊర్లల్లో తిరుగుతుంటే ఎండిపోతున్న పొలాలు కనిపిస్తున్నాయన్నారు. సభలో నీళ్ల గురించి మాట్లాడాలని రైతులు కోరుతున్నారన్నారు. అవకాశమొస్తే మాట్లాడుతానని హామీనిచ్చానని, గవర్నర్ ప్రసంగంపై పార్టీ తరపున మాట్లాడే అవకాశం తనకు కెసిఆర్ ఇచ్చారని చెప్పారు. ఈ సమయంలో పలువురు కాంగ్రెస్ సభ్యులు కెసిఆర్ ఎక్కడ అని అరిచారు. ' ఎక్కడో దూరంలో లేరు. మీ ముఖ్యమంత్రి కంటే దూరం లేరు. దగ్గర్లోనే ఉన్నారు. రన్నింగ్ కామెంట్ ఆపేయండి. ఎక్కువ మాట్లాడకుండా మూస్కోండి.... రైతులు, గొర్రెల కాపర్ల గురించి మాట్లాడుతుంటే ఎందుకు భయపడుతున్నారు...' అని వ్యాఖ్యానించారు. ఎన్కటికి ఓ ఊర్ల ఏతుల వెంకటయ్య ఉండేవాడని, తన దగ్గర బర్లు లేకపోయినా ఉన్నట్టు చెబితే.. సర్పంచి ఎక్కడివని నిలదీస్తే... "పోయిన బర్రె దొరికితే.. చచ్చింది లేసొస్తే... అత్తగారు ఇస్తమన్నది ఇస్తే... నేను ఒకటి కొనుక్కుంటే నాలుగు బర్లు కావా?" అన్నడంట అని కథ వివరించారు. గవర్నర్ ప్రసంగం గట్లనే ఉందన్నారు. రైతులకు రుణమాఫీ చేశారా? రైతుబంధు ఇచ్చారా? ఇజిఎస్ కార్మికులకు రూ.12 వేలిచ్చారా? రూ.12 వేలు ఆటోకార్మిక సోదరులకు ఇచ్చారా? రూ.2500 మహాలక్ష్మి అక్కాచెల్లెళ్లకు ఇచ్చారా? రైతులకు బోనస్ ఇచ్చారా? తులం బంగారు ఇచ్చారా? స్కూటీలిచ్చారా? రెండు లక్షల ఉద్యోగాలిచ్చి సందుక కింద పెట్టారా? ప్రజలకు ఏం చేశారు అధ్యక్షా" అంటూ ప్రశ్నలను సంధించారు.



శాసనమండలి సమావేశాల్లో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

10 ఏళ్లలో మీరు చేయనిది..15 నెలల్లో ఒక్కొక్కటిగా చేస్తున్నాం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పదేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరిస్తే..తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 15 నెలల్లో ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బదులిచ్చారు. 'ఉద్యమ సమయంలోనూ, 2013 ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ఇచ్చిన హామీలను కెసిఆర్ అమలు చేశారా? దళితున్ని సిఎం చేయకుంటే తల నరుక్కుంటానన్నాడు.. నరుక్కుండా? దళితులకు మూడెకరాల భూమిచ్చి బోర్లు వేయిస్తన్నడు...అది చేసిండా? తమ పార్టీకి చెందిన దళిత నేత భట్టి విక్రమార్క సిఎల్పీ నేతగా ఉంటే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో కొన్నట్టు కొని ప్రతిపక్ష హోదా లేకుండా కెసిఆర్ చేసిండు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించిండా? ఎందుకు మాట్లాడుతున్నారు' అని నిలదీశారు.

బిఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. సభాసాంప్రదాయాల ప్రకారం స్పీకర్ సభను నడపాలని కోరారు.

స్పీకర్ వర్సెస్ జగదీశ్ రెడ్డి

సబ్జెక్టుపై డీవీయేషన్ కాకుండా గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడాలని సభ్యులకు సూచిస్తూ జగదీశ్‌రెడ్డికి స్పీకర్ మైకు ఇచ్చారు. 'ప్రసంగంలో లేని ఒక్కటైనా మాట్లాడానా? సభలో ఉండమంటే ఉంటా..పొమ్మంటే పోతా. ఏందిది?' అని జగదీశ్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని.. స్పీకర్‌ను బెదిరించడం సరిగాదని, జగదీశ్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. తాము మాట్లాడుతుంటే వ్యంగ్యంగా నవ్వడం జగదీశ్‌రెడ్డికి తగదన్నారు. అలా వ్యంగ్యంగా నవ్వితేనే ప్రజలు అక్కడ కూర్చోబెట్టారని చురకలు అంటించారు. 'జగదీశ్వర్‌రెడ్డి అసహనానికి గురికాకండి.. పదేళ్లు మంత్రిగా చేశారు. సభా సాంప్రదాయాలను తప్పుదోవ పట్టించడం మంచిది కాదు' అని స్పీకర్ అభ్యర్థించారు. 'అధ్యక్షా. ఏ సభా, సాంప్రదాయాలకు విరుద్ధంగా మాట్లాడానో చెప్పిన తర్వాతనే నేను మాట్లాడుతా' అంటూ జగదీశ్‌రెడ్డి కూర్చున్నారు. మళ్లీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వగా.. 'సభను ఆర్డర్‌లో పెడితేనే మాట్లాడుతా.. నేను ఏం విరుద్ధంగా మాట్లాడానో చెప్పిన తర్వాతనే మాట్లాడుతా' అని మొండికేశారు. ఈ సభలో అందరికీ హక్కులున్నాయి. మా అందరి తరపున కూర్చోబెట్టిన పెద్దమనిషిగా మాత్రమే అక్కడ మీరు కూర్చున్నారు తప్ప ఈ సభ నీ సొంతం కూడా కాదు. సభలో అందరికీ సమానమైన హక్కులుంటాయి.' అంటూ స్పీకర్‌నుద్దేశించి వివాదాస్పద, ఏకవచనంతో వ్యాఖ్యలు చేశారు. దీనిపై అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్‌కు జగదీశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. సభ కాంగ్రెస్ పార్టీకో.. ఒక ప్రభుత్వానికో సబంధించింది కాదు... ప్రతిపక్ష సభ్యులకు కూడా సమాన హక్కులుంటాయని మాత్రమే జగదీశ్‌రెడ్డి అన్నారని, దాంట్లో తప్పేముందని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. సభలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతుండటంతో సభను పావుగంట వాయిదా వేస్తున్నట్టు 11: 35 నిమిషాలకు స్పీకర్ ప్రకటించారు.

క్షమాపణలు చెప్పకుంటే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి : విప్ అడ్లూరి లక్ష్మణ్

స్పీకర్ చైర్‌లో ఉన్న దళితున్ని పట్టుకుని జగదీశ్‌రెడ్డి అహంకారంతో బెదిరించడం సరిగాదని, ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ పట్టుబట్టారు. క్షమాపణలు చెప్పకుంటే సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో స్పీకర్‌పై పేపర్ విసిరాడనే నెపంతోనే దళిత ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సభ్యత్వాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్పీకర్‌ను అవమానించిన, ఎదురు ప్రశ్నించిన జగదీశ్‌రెడ్డి సభ్యతాన్ని ఎందుకు రద్దు చేయకూడదు అని అడిగారు. మొదటి నుంచీ దళితుల పట్ల ఆయన చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

జగదీశ్‌రెడ్డి సస్పెండ్

జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ సభ్యులు, మంత్రుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు.

జాతీయ ఎస్‌సి కమిషన్ విచారణ

- ఆజాంజాహీ మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ నగరంలోని ఆజాంజాహి మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై గురువారం జాతీయ ఎస్‌సి కమిషన్ విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ తన కార్యాలయంలో పలు దళిత, ప్రజాసంఘాల, కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ గంగుల దయాకర్, జెఎసి కన్వీనర్ కొణతం కృష్ణ, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు పెరుమళ్ల లక్ష్మణ్, ఆజాంజాహీ మిల్లు కార్మికులు, కన్వీనర్ ఆకేన వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. గతంలో జాతీయ ఎస్‌సి కమిషన్ చైర్మన్ వడ్డేపల్లి రామచందర్ వరంగల్ నగరంలో పర్యటించినప్పుడు కార్మిక భవనం కూల్చివేతపై విచారణ జరిపించాలని తాము వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. విచారణలో భాగంగా పలువురు కార్మికులు, నాయకులు తమకు జరిగిన అన్యాయాన్ని తహసీల్దార్‌కు వివరించారు. 75 ఏళ్లుగా కార్మికుల సమావేశాలు, సభలకు వేదికైన కార్మిక భవనాన్ని తప్పుడు పత్రాలతో కబ్జా చేసి కూల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. తప్పుడు పత్రాలతో కార్మిక భవనాన్ని కబ్జా చేసిన నరేష్ రెడ్డిని, కూల్చిన ఓం నమశ్శివాయలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు సింగిరెడ్డి యశోద, హరి నారాయణ, గుత్తికొండ రవి, పల్లకొండ సుధాకర్, కొంపల్లి ప్రవీణ్, ఆరోగ్యం, సందీప్, విజయ్, బాబు, నర్సింగం, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

- శాసనమండలిలో పలువురు సభ్యుల ప్రత్యేక ప్రస్తావన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూపాలపల్లి నియోజకవర్గంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని బీఆర్ఎస్ శాసనమండలి నేత మధుసూదనాచారి మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం శాసనమండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తే నష్టనివారణ కొంత వరకు జరుగుతుందని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పెరిగిన విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని గత ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానికి సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలనీ, మెయిన్ అంగన్ వాడీలుగా మారిన వాటిలో పని చేస్తున్న వారికి పెరిగిన జీతాలివ్వాలని కోరారు. అదే విధంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ ప్రయోజనాలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మహమూద్ అలీ మాట్లాడుతూ మంత్రివర్గంలో ఒక ముస్లింను తీసుకోవాలని కోరారు. రెసిడెన్షియల్ స్కూళ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఏ.వీ.ఎన్.రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోతే ఉచితాలను నిలిపివేయాలని సలహా ఇచ్చారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ హైదరాబాద్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారసత్వ కట్టడాల వద్ద ప్రజలను ఆకర్షించే లైట్స్ అండ్ సౌండ్స్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ బహుళ అంతస్థుల భవనాల్లో ఉన్న లిఫ్టుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాద్ధాలు జరగకుండా ఏదైనా చట్టం ఉంటే పటిష్టంగా అమలు చేయాలని, లేకపోతే కొత్త చట్టాన్ని తీసుకురావాలని సూచించారు.

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేయాలి

- బైరపాక శ్రీనివాస్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు) టివివిపి విభాగం కార్యదర్శి బైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 010 పద్దు కింద వేతనాలను అందజేయాలని కోరారు. దీనికి సంబంధించిన బిల్లును ఈ బడ్జెట్ సమావేశంలోనే ఆమోదం తెలపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు ఆర్థిక ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించి ఉదారతను చాటుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీవీవీపీలో రెగ్యులర్ ఉద్యోగులకు 13 రోజులు గడిచినా జీతాలు రాలేదనీ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, శానిటేషన్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ఏం చేసింది? : జీవన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనమండలిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. గురువారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా జరిగిన చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలో నీటి కష్టాలకు కెసిఆర్ సొంత తెలివితో వేసిన రీ డిజైన్ కారణమని ఆరోపించారు. పదేళ్లలో గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకునేందుకు సరైన నిర్ణయాలు తీసుకోలేదని తెలిపారు. ప్రతిపక్షమంటే కేవలం విమర్శలు చేయడమే కాదనీ, సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలన్నారు. బిఆర్ఎస్ సర్కారు చేసిన అప్పుకు ఏడాది దాదాపు రూ.ఒక లక్ష వడ్డీ చెల్లించాల్సి వస్తున్నదని విమర్శించారు. మిషన్ భగీరథ ఏమైందంటూ ప్రశ్నించారు. పెళ్లికి కళ్యాణలక్ష్మి ఇచ్చి పిల్లలు పుట్టాక రేషన్ కార్డులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కొన్ని ఆస్పత్రులు ఇప్పటికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రోగులకు చికిత్స అందించేందుకు నిరాకరిస్తున్నాయనీ, అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరించాలని డిమాండ్ చేశారు. జెబిఎస్ నుంచి ఉత్తర తెలంగాణ వెళ్లే ప్రజలు ట్రాఫిక్ ఇబ్బంధులను ఎదుర్కొంటున్నారనీ, భూబదలాయింపు కింద రక్షణశాఖ పరిధిలోని భూములను కేటాయించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి సహకరించాలన్నారు. పదేళ్లు హంగు, ఆర్భాటం, ప్రచారంతో బీఆర్ఎస్ సర్కారు ఒక శాంపిల్ సర్కార్‌ను నడిపిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్, చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు, పంటల మార్పిడికి ప్రోత్సాహం, 56 వేల ఉద్యోగాల కల్పన తదితర కార్యక్రమాలతో ప్రజాపాలన దిశగా అడుగులు పడ్డాయని కొనియాడారు. 56 శాతం మంది బీసీలున్నారని కులగణన చేసి అధికారికంగా ప్రకటించిందని గుర్తుచేశారు. ప్రజల సొమ్ముతో సమగ్ర కుటుంబ సర్వే చేసి ఆ రిపోర్టును ఇంట్లో పెట్టుకుంటారా? అని బిఆర్ఎస్‌ను ప్రశ్నించారు.

బిఆర్ఎస్ సభ్యులు శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. 50 ఏళ్లకుపైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను పాలించిన కాంగ్రెస్, తెలుగుదేశం సమైక్య పాలకులు తెలంగాణను నిర్లక్ష్యం చేశారని తెలిపారు. దీనిపై మంత్రి కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్దిష్ట కాలం, ఎవరి పాలనలో అంటూ మాట్లాడాలని సూచించారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వచ్చాక రైతుల పట్ల పాలన బాగుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.ఒక లక్ష కోట్లైతే అవినీతి రూ.ఒక లక్ష కోట్లు జరిగిందని ఎలా ఆరోపణలు చేస్తారంటూ శేరి సుభాష్ రెడ్డి ఎదురు ప్రశ్నించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణపై వివక్షకు ప్రొఫెసర్ కోదండరాం సాక్ష్యమని తెలిపారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలేవి? అని ప్రశ్నించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఆ అబద్ధాలనే గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రజావాణి ఈ నెల18కి వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హెూలీ పండుగ నేపథ్యంలో ఈ నెల 14న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మార్పును గమనించి దరఖాస్తుదారులు ఈ నెల 18న హాజరు కావాలని సూచించారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయునిపై కేసు

- నిజామాబాద్ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడంతో తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని పల్లికొండ గ్రామంలోని లోకాయి రిషిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 12న స్కూలుకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో లోకాయ్ రిషిక్ బుక్స్ కింద పడేశాడనే కారణంతో స్కూల్ టీచర్ భూమేష్ ఇష్టం వచ్చినట్టు విద్యార్థిని కర్రతో కొట్టాడు. దాంతో గాయాలయ్యాయి. కోపోద్రిక్తులైన విద్యార్థి తండ్రి.. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులు అనురాధను కోరారు.

తెలంగాణ రైజింగ్‌కు మద్దతుగా నిలవండి

- కేంద్ర మంత్రి జైశంకర్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి గురువారం కలిశారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జైశంకర్‌ను సిఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమైన హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వ శాఖ మద్దతుగా నిలుస్తుందని సిఎం రేవంత్‌కి కేంద్ర మంత్రి జైశంకర్ తెలిపారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి జైశంకర్‌కు తెలంగాణ తల్లి చిత్ర పటాన్ని అందజేస్తున్న సిఎం రేవంత్

హెచ్‌సియు భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర

- ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సియు) భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర జరుగుతున్నదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. భూములను విక్రయించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 400 ఎకరాల భూమిని వేలం ప్రక్రియ వేయడాన్ని నిలుపుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి ప్రాంతంలో హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని ఈనెల ఎనిమిది నుంచి 15 వరకు వేలం వేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. టిజిఐఐసి సంస్థ ద్వారా కార్పొరేట్ సంస్థలకు ఈ భూములను విక్రయించి రూ.18 వేల కోట్లు సమీకరించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ భూములను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేసిందనీ, విద్యార్థుల తిరుగుబాటుతో ఆ నిర్ణయాన్ని విరమించుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పేరుతో కాంగ్రెస్ పేద విద్యార్థులు చదువుతున్న వర్సిటీ భూములను లాక్కుని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే చర్యలను మానుకోవాలని కోరారు. ప్రభుత్వమే కోర్టుకు వెళ్లి భూములను విక్రయించేలాగా అనుకూల తీర్పు తీసుకొచ్చి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని విమర్శించారు. పక్షులున్నాయనీ, వృక్ష జాతులున్నాయనీ, పర్యావరణం, సాంస్కృతిక వాతావరణం కలిగిన ఆ భూములను కార్పొరేట్లకు అప్పగిస్తే జీవవైవిధ్య దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అభివృద్ధి కోసం భూములను కొనసాగించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

హెచ్‌సియు భూముల వేలాన్ని వెనక్కి తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

హెచ్‌సియుకు చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రభుత్వం అని చెప్తూ ప్రభుత్వ విద్యాసంస్థల భూములను ఎలా విక్రయిస్తుందని ప్రశ్నించారు.

కార్పొరేట్లకు అమ్మే నిర్ణయాన్ని మానుకోవాలి : పిడిఎస్‌యు విజృంభణ

హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు అమ్మే నిర్ణయాన్ని మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎస్‌యు విజృంభణ రాష్ట్ర అధ్యక్షులు రాయిసీడం బాపూరావు, ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ పేద అణగారిన వర్గాల విద్యార్థులు చదువుకునే వర్సిటీ భూములను లాక్కోవడమంటే వారిని విద్యకు దూరం చేయడమేనని విమర్శించారు.

దుబాయి నుంచి కాంగ్రెస్ సర్కారుపై విష ప్రచారం

- తెలంగాణ కులగణనను కేంద్రం మోడల్‌గా తీసుకోవాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దుబాయిని కేంద్రంగా చేసుకుని సోషల్‌మీడియా వేదికగా కొందరు తెలంగాణలోని ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. గవర్నర్ ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనను ఆయన గురువారం శాసనసభలో ప్రవేశపెట్టి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చక్కగా వివరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ధన్యవాదాలు తెలిపారు. 42 శాతం బిసి రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను కేంద్ర ప్రభుత్వం మోడల్‌గా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కులగణనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొనకపోవడాన్ని తప్పుబట్టారు. బిసిల పట్ల వారికి ఇంత చులకన భావం తగదన్నారు. కులగణన సరిగా జరగలేదని వారే విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. లక్ష మందికిపైగా ప్రభుత్వోద్యోగులు శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టారనీ, సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశాన్ని కూడా ఇచ్చామని తెలిపారు. రాజకీయ, విద్య, ఉద్యోగ నియామకాల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు దక్కబోతున్నాయని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్రాన్ని ఒప్పించి 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతే రాజుగా భావించి రూ.2 లక్షల లోపు ఉన్న బ్యాంకు రుణాలను మాఫీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సన్నాలకు బోనస్ బోగస్ అని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. బోనస్ కింద రైతులకు రూ.1206 కోట్లు ఇచ్చామని తెలిపారు. తమది కమీషన్ల ప్రభుత్వమని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. మిషన్ భగీరథలో కమిషన్లు, మిషన్ కాకతీయలో కమిషన్లు, కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, కరెంటు కొనుగోళ్లలో కమీషన్లు...ఇలా అన్నింటి కమీషన్లు తీసుకుని ఆ కుటుంబంలో నలుగురే బాగుపడ్డారని విమర్శించారు. ఆ నలుగురు కుటుంబ సభ్యుల వల్లనే నేడు రాష్ట్రం అప్పులపాలైందని ఆరోపించారు.

తెలంగాణకు పదేండ్లలో జరిగిన నష్టానికి రిపేరు చేస్తున్నాం : వేముల వీరేశం

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణకు జరిగిన నష్టానికి రిపేరు చేసే పనిలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం చెప్పారు. పదేండ్ల కాలంలో దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై కేసీఆర్ సర్కారు వివక్ష చూపిందని విమర్శించారు. రూ.20 వేల కోట్ల సంపద హైదరాబాద్‌లోని వెయ్యి మంది చేతుల్లోనే పోగైందని, బిఆర్ఎస్ నేతల తప్ప రాష్ట్రం అభివృద్ధి చెందలేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవిని త్యాగం చేసి ఉద్యమానికి జీవం పోశారని గుర్తుచేశారు. ఎస్‌సి వర్గీకరణ అంశంపై కేసు సుప్రీం కోర్టులో ఉంటే క్లియర్ కావడానికి సిఎం రేవంత్‌రెడ్డి సహకరించారనీ, త్వరలో ఎస్‌సి వర్గీకరణ బిల్లు అసెంబ్లీ ముందుకు రాబోతున్నదని చెప్పారు. జయజయ హే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నామన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు.

హెచ్‌సియు భూముల వేలం ఆపాలి

- యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్ : విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం ద్వారా అమ్మడాన్ని వెంటనే ఆపాలని యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి ప్రాంతంలోని ఈ 400 ఎకరాల భూమిని టీఎస్ఐఐసీ ద్వారా మార్చి 8 నుంచి 15వ తేదీ మధ్య వేలం వేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కార్పొరేట్ సంస్థలకు ఈ భూములు అమ్మడం ద్వారా రూ.18వేల కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. దాంతో భూముల వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వేలం వేయాలనుకున్న ఆయా భూముల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంతో విలువైన భూములను కలిగి ఉందని, ఆ భూముల్లో ప్రధానంగా పురాతన కాలం నాటి పెద్ద పెద్ద కొండలు చరిత్రకు సాక్ష్యంగా ఉన్నాయని తెలిపారు. యూనివర్సిటీ భూములను వేలం ద్వారా విక్రయించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూములు అమ్మితే చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షణ కోసం దశలవారీగా పోరాటం నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆలోచన విరమించుకుని యూనివర్సిటీ భూములను పరిరక్షించేందుకు ముందుకు రావాలని వారు ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

టివివిపిలో ఈ నెల జీతాలు చెల్లించనిది వాస్తవం కాదా?

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫిబ్రవరి జీతాలు చెల్లించేందుకు మార్చి నెలలో 13 రోజులు గడిచినా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని 13 వేల మందికి ప్రభుత్వం ఇవ్వలేదని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. అబద్ధాలకు, అసత్యాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నది సీఎం కళ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఆరోగ్య శాఖలోనే కాదు, పోలీసు శాఖలోనూ ఇదే దుస్థితి ఉందని తెలిపారు. పెంచిన జీతాలు, అలవెన్సుల మాట దేవుడెరుగు. ఉన్న జీతాలు ఇప్పటికీ రాక హెూం గార్డులు ఆవేదన చెందుతున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామనే అబద్దాన్ని, అవకాశం ఉన్న చోటల్లా ప్రచారం చేసుకునే సీఎంకు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల ఆవేదన అర్థం కావడం లేదా? దుష్ప్రచారంతోనే ఏడాదిన్నర గడిపారు. ఇంకెంత కాలం వెళ్లదీస్తారు.? అని నిలదీశారు. టివివిపి డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది సహా, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, హెూం గార్డులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.